గొల్లకుంట ఎఫ్‌టీఎల్‌కు హద్దులు ఏర్పాటు

- పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు
- పూడ్చిన మట్టిని తొలిగించాలని ఆదేశాలు

గొల్లకుంట కబ్జాను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఈఈ మధుసూదన్‌రెడ్డి, డీఈ రామస్వామి

జిన్నారం, ఫిబ్రవరి12 : 'గొల్లకుంట శిఖం కబ్జా' శీర్షికన సోమవారం నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. జిల్లా ఇరిగేషన్ ఈఈ మధుసూదన్‌రెడ్డి, డీఈ రామస్వామి, వర్క్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డిలతో కలిసి గొల్లకుంటను పరిశీలించారు. వారంరోజుల క్రితం రైతుల ఫిర్యాదు మేరకు ఇరిగేషన్ అధికారులు గొల్లకుంటను పరిశీలించి హద్దులు నిర్ధారించి శిఖంలో వేసిన మట్టిని తొలిగించాలని సదరు వ్యక్తులకు ఆదేశాలిచ్చి వెళ్లారు. కానీ గొల్లకుంటలో వేసిన మట్టి వేసినట్లుగానే ఉండడం, కుంట కబ్జాపై పత్రికల్లో కథనాలు రావడంతో అధికారులు హుటాహుటిన వచ్చి గొల్లకుంటను పరిశీలించారు.

గొల్లకుంటకు ఎఫ్‌టీఎల్ నిర్ధారించి హద్దులు ఏర్పాటు చేయగా 15మీటర్లుపైగా కుంటను ఆక్రమించి మట్టి నింపినట్లు గుర్తించారు. వెంటనే కుంట లో వేసిన మట్టిని తొలిగించాలని, లేదంటే కేసులు నమోదు చేస్తామని అధికారులు సదరు వ్యక్తులను హెచ్చరించారు.

రాయసముద్రంలో గుర్రపు డెక్క తొలిగింపు

రామచంద్రాపురం, ఫిబ్రవరి 12: ఆర్సీపురం డివిజన్‌లోని రాయసముద్రం చెరువులో సోమవారం గుర్రపుడెక్కను తొలిగించారు. చెరువులో గుర్రపుడెక్క పేరుకుపోవడంతో దోమలు, దుర్వాసన వస్తున్నదని స్థానికులు కార్పొరేటర్ పుష్పానగేశ్‌కు ఫిర్యాదు చేయడంతో బల్దియా సిబ్బందితో గుర్రపుడెక్క తొ లిగింపు చర్యలు చేపట్టారు. పాషానగర్‌లోని ఓపెన్ డ్రైనేజీని కూడా శుభ్రం చేయించారు. కార్యక్రమంలో మల్లేశ్, సతీశ్, రాకేశ్, కిరణ్‌గౌడ్, శ్రీను, రాములుయాదవ్, మాణయ్య, శోభా, మల్లికార్జున్, సుధాకర్, మహేశ్ పాల్గొన్నారు.

రాయసముద్రంలో గుర్రపుడెక్కను బల్దియా సిబ్బందితో తొలగింపజేస్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

బ్రహ్మాండంగా వైకుంఠపురం బ్రహ్మోత్సవాలు

కంది, ఫిబ్రవరి 12: సంగారెడ్డి పట్టణంలోని మహాలక్ష్మీ గోదా సమేత విరాట్ వేంకటేశ్వరస్వామి 11వ వార్షిక బ్రహ్మోత్సవాలు బ్రహ్మాండంగా జరుగుతున్నాయి. ఆలయ ప్రధాన అర్చకుడు కందాడై వరదాచార్యుల సమక్షంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం శాంతిపాఠం, వేద విన్నపములు, ద్వార తోరణ ధ్వజాకుంభారాధన, అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, బలిహరణం నిర్వహించారు. సాయంత్రం విష్ణు సహస్రోత్ర పారాయణం, ద్వార తోరణ ధ్వజాకుంభారాధన, చతుస్థానార్చన, దేవతాహ్వానం తదితర పూజలు జరిగాయి. రాత్రి పెద్దశేష వాహ న సేవను వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

అగ్నిప్రతిష్ఠ చేస్తున్న ఆలయ ప్రధాన అర్చకుడు కందాడై వరదాచార్యులు

వైభవంగా మల్లికార్జున స్వామి జాతర

జిన్నారం, ఫిబ్రవరి 12 : శివనగర్‌లో మల్లికార్జున స్వామి జాతర సోమవారం వైభవంగా జరిగింది. జాతరలో స్వామివారి కల్యాణోత్సవం, అగ్నిగుండాల కార్యక్రమాలు జరిగాయి. జాతరకు జడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గూడెం మధుసూదన్‌రెడ్డి, వెంకటేశంగౌడ్, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, జిన్నారం వైస్ఎంపీపీ గంగురమేశ్ మల్లికార్జునస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అగ్నిగుండాల కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా జడ్పీవైస్‌చైర్మన్ ప్రభాకర్, గూడెం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం జాతరలకు, మన తెలంగాణ ఆచారాలకు పెద్దపీట వేసిందన్నారు. కార్యక్రమంలో మాదారం-ఖాజీపల్లి ఎంపీటీసీ ఆకుల భార్గవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజేశ్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మహేశ్, మాజీ సర్పంచ్ పూజారిరాజు, సుధాకర్‌యాదవ్, రామకృష్ణ పాల్గొన్నారు.

తెల్లాపూర్‌లో ఇంటర్ కమ్యూనిటీ స్పోర్ట్స్

రామచంద్రాపురం, ఫిబ్రవరి 12: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మేరు ఇంటర్నేషనల్ స్కూల్‌లో విజేత ఇంటర్ కమ్యూనిటీ స్పోర్ట్స్ కాంపిటిషన్‌ను మేరు మేనేజ్ మెంట్ నిర్వహించింది. వివిధ ఇంటర్‌కమ్యూనిటీస్‌కు చెందిన విద్యార్థులు క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. బాస్కెట్ బాల్, బాస్కెట్‌బాల్ షూట్, బ్యాడ్మింటన్, రన్నింగ్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో 850మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు మేరు స్కూల్ మేనేజ్‌మెంట్ బహుమతులను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇంటర్ కమ్యూనిటీస్పోర్ట్స్‌తో ప్రతి ఒక్కరిలో ఐకమత్యం పెంపొందుతుందని తెలిపారు.

వైద్యురాలి అనుమానాస్పద మృతి

అమీన్‌పూర్, ఫిబ్రవరి 12: అనుమానాస్పదంగా వైద్యురాలు మృతి చెందిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. రామచంద్రాపురం బీహెచ్‌ఈఎల్‌లోని హెచ్ఐజీలో ఉంటున్న రచనారెడ్డి(26) ఎంబీబీఎస్ పూర్తి చేసి బాచుపల్లిలోని మమత దవాఖానలో ఇంటర్న్‌షిప్ చేస్తున్నది. సోమవారం ఉదయం విధులకు వెళ్తున్నానని చెప్పి కారులో బయలుదేరింది. కిష్టారెడ్డిపేట్ ఓఆర్ఆర్ వద్ద కారు అదుపుతప్పి రోడ్డుపక్కన ఆగిపోయి ఉంది. దీనిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని ఆమెను దవాఖానకు తరలించారు. ఇంజక్షన్ ద్వారా విషం తీసుకున్నట్లు వైద్యులు పేర్కొన్నారు. ఈమేరకు ప్రాథమిక విచారణ చేపట్టి దర్యాప్తు చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు.

అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకోవాలి

కంది, ఫిబ్రవరి 12: మండలంలోని ఎర్ధనూర్ 231 సర్వే నంబర్‌లో క్వారీ, క్రషర్స్ యాజమాన్యం ఆక్రమించిన అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో జిల్లా అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ పేదల నుంచి అసైన్డ్ భూములను లాక్కొని క్వారీలు నడిపిస్తున్న యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎర్ధనూర్ శివారులో పాతాలలోతుకు క్వారీలు తవ్వడంతో గుట్టపై నుంచి చెరువులోకి వచ్చే వర్షపునీరు రాకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. క్రషర్ల బ్లాస్టింగ్‌తో ఎంతోమంది ప్రమాదాలకు గురయ్యారని, పొగ, దుమ్ముతో పంటలు పండక రైతులు నష్టపోతున్నారన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఝరాసంగం మండలం మచనూర్‌లో పాతపంటల జాతరలో ఎడ్ల బండ్ల ఊరేగింపు

పాత పంటల జాతరలో మాట్లాడుతున్న డీడీఎస్ డైరెక్టర్ డాక్టర్ రుక్మిణీరావు

పెరిగిన చిరుధాన్యాల సాగు

- 24 ఏండ్లుగా పాత పంటల సంరక్షణ కోసం జాతర
- మాచనూర్ పచ్చసాలేలో ఘనంగా ముగింపు
- పాత పంటల జాతరకు హాజరైన వ్యవసాయ శాస్త్రవేత్తలు
- చిరుధాన్యాలు సాగు చేసిన మహిళలకు సన్మానం

జహీరాబాద్, ఫిబ్రవరి 12: పాత పంటల సంరక్షణ కోసం మహిళాసంఘాలను ఏర్పాటు చేసి 24 ఏండ్లగా జాతర నిర్వహిస్తున్నామని డీడీఎస్ డైరెక్టర్ డాక్టర్ రుక్మిణీరావు తెలిపారు. సోమవారం ఝరాసంగం మండలంలోని మాచనూర్‌లోని పచ్చసాలేలో పాత పంటల ముగింపు ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 24ఏండ్లగా మహిళాసంఘలను ఏర్పాటు చేసి జాతరను ప్రారంభించారన్నారు. ప్రపంచంలో చిరుధాన్యాల సాగు పెరిగిందన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో మిల్లెట్ మిషన్ అంటూ చిరుధాన్యాల పంటల సాగు పెంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా జీవవైవిధ్య సంరక్షకులైన మహిళలు చెరాగ్‌పల్లి మరియమ్మ, జాదవ్ సుశీల్‌బాయి, రాములమ్మ, రోజమ్మ, మంజులమ్మ తదితరులను సన్మానించారు.

సమావేశంలో నాబార్డు డీడీఎం కృష్ణతేజ, సెంటర్ ఫర్ సస్టెనబుల్ అగ్రికల్చరర్ రామాంజనేయులు, మెదక్ నాబార్డు డీడీఎం తిమోతి, జహీరాబాద్ వ్యవసాయ శాఖ ఏడీఏ భిక్షపతి, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్లు వినోద్ పావురాలు, వేదకుమారి, న్యాల్‌కల్ ఎంపీపీ అంజమ్మ, డీడీఎస్ మహిళాసభ్యులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలు సాగు చేసిన మహిళాశ రైతును సన్మానిస్తున్న డీడీఎం కృష్ణతేజ

విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలి

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ రూపేశ్

- సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేశ్
- సైబర్ మోసాలు, డ్రగ్స్, పోక్సో చట్టం, రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన

జహీరాబాద్, ఫిబ్రవరి 12: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని పట్టుదలతో చదవాలని ఎస్పీ రూపేశ్ అన్నారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలోని పీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో విద్యార్థులకు సైబర్ మోసాలు, డ్రగ్స్, పోక్సో చట్టం, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదువుకొని ఉన్నత లక్ష్యంతో ఉద్యోగాలు సాధించాలన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. బైక్ నడిపేవారు హెల్మెట్ తప్పకుండా ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపడంతో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సైబర్ మోసాలు చేసేవారు ఫోన్లకు లింక్‌లు, ఓటీపీలు పంపిస్తారని, వాటిని ఎవరూ ఓపెన్ చేయరాదన్నారు. ఓపెన్ చేస్తే మన బ్యాంకులో ఉన్న డబ్బులు మాయం చేస్తారని చెప్పారు. విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండి, తల్లిదండ్రుల కష్టాలను గుర్తించి చదువుకోవాలన్నారు. ప్రేమ పేరుతో మోసాలు జరుగుతున్నాయని, వాటి పట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యార్థినులు కష్టాల్లో ఉన్న సమయంలో 100కు ఫోన్ చేయాలన్నారు. వెంటనే ప్రమాద స్థలానికి పోలీసులు చేరుకుంటారని చెప్పారు. సమావేశంలో అడిషనల్ ఏఎస్పీ అశోక్, సైబర్ క్రైం డీఎస్పీ రఘు, జహీరాబాద్ డీఎస్పీ రఘు, జహీరాబాద్ పట్టణ, రూరల్ సీఐలు రవి, వెంకటేశం, సీసీఎస్ సీఐ శివలింగం, జహీరాబాద్ పట్టణ ఎస్ఐ శ్రీకాంత్, డివిజన్‌లోని ఎస్ఐలు ప్రసాద్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆస్తి తగాదాలతో వ్యక్తి హత్య

అందోల్, ఫిబ్రవరి 12: ఆస్తి తగాదాలతో వ్యక్తిని సోమవారం దారుణంగా హత్య చేశారు. హత్యకు సంబంధించిన వివరాలను జోగిపేట ఎస్సై అరుణ్‌కుమార్ గౌడ్ తెలియజేశారు. అల్మాయిపేట్ గ్రామానికి చెందిన మునిరొద్దీన్(60)కు సమీప బంధువు ఖమ్రోద్దీన్‌కు కొన్నిరోజులుగా భూమి పంచాయతీ నడుస్తున్నది. ఈ విషయంపై పలుమార్లు గ్రామపెద్దల సమక్షంలో పంచాయతీలు జరిగాయి. ఈ విషయంపై మాట్లాడుదామని పొలం వద్దకు రావాలంటూ ఖమ్రోద్దీన్ మునిర్‌కు ఫోన్ చేశాడు. తండ్రితో కలిసి పొలం వద్దకు వెళ్లగా అప్పటికే అక్కడ ఉన్న కొంతమంది కిరాయి గుండాలు మునిరొద్దీన్‌పై కత్తులతో దాడిచేయగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రికి గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికెళ్లి వివరాలు సేకరించారు. హంతకులు ఉపయోగించిన వాహనం అందోల్ శివారులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద వదలివెళ్లారు. ప్రధాననిందితుడు పోలీసుల అదుపుతో ఉండగా, మిగతా వారి కోసం గాలిస్తున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

జిన్నారం, ఫిబ్రవరి 12: బైక్‌ను కారు ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం రాత్రి ఊట్ల శివారులో జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ఊట్ల గ్రామానికి చెందిన జర్రు చిన్న ముత్యాలు కుమారుడు సాయికుమార్ (16), బావమరిది కుమారుడు జశ్వంత్ (17) ఊట్ల గ్రామం నుంచి జిన్నారం వైపు బైక్‌పై వెళ్తున్నారు. హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన వ్యక్తులు హత్నూర మండలం శేర్‌ఖాన్‌పల్లిలోని పలుగు పోచమ్మ ఆలయానికి వెళ్లి కారులో తిరిగి కూకట్‌పల్లికి వెళ్తున్నారు. సబ్‌స్టేషన్ వద్ద ఆటోను ఓవర్‌టేక్ చేసి వెళ్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టారు. ప్రమాదంలో సాయికుమార్, జశ్వంత్‌కు కాళ్లు విరిగాయి. ఇద్దరినీ కూకట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నీటి ఎద్దడిని పరిష్కరించాలి

బొల్లారం, ఫిబ్రవరి 12: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు బీసీకాలనీలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు సోమవారం మున్సిపల్ అధికారులను కలిసి విజ్ఞప్తి చేశారు. కాలనీలో నెలకొన్న నీటి సమస్యను అధికారులకు విన్నవించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ కార్యాలయంలో ఆర్వో శ్రీధర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

ప్రజావాణి అర్జీలను సత్వరం పరిష్కరించాలి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి
- కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు 65 అర్జీలు

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 12 : ప్రజావాణికి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాధుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్ లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన అర్జీదారులు తమ ఫిర్యాదుల ను అందజేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రజావాణిలో మొత్తం 65అర్జీలు అందగా, అందులో 18రెవెన్యూ శాఖకు సంబంధించినవి కాగా, మిగతా 47అర్జీలు వివిధ శాఖలకు సంబంధించి వచ్చాయి. ఆయా దరఖాస్తులను జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి స్వీకరించిన కలెక్టర్ వాటిని సకాలంలో పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఏవో పరమేశ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 12: ఇంటర్మీయట్ వార్షిక పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాం తి అ ధికారులను ఆదేశించారు. సోమవారం మినీ సమావేశ మందిరంలో ఇంటర్ పరీక్షల నిర్వహణపై అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 28 నుంచి మార్చి 16 వరకు జరిగే ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు 52 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యా హ్నం 12గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు జిల్లాలో మొత్తం 36, 153మంది హాజరుకానున్నారని, ఇందులో 17, 665మంది విద్యార్థులు ప్రథమ సంవత్సరం కాగా, 18,488మంది విద్యార్థులు సెకండియరని వెల్లడించారు. 17ప్రశ్నాపత్రాల స్టోరేజీ పాయింట్లు, రెండు ఫ్లైయింగ్ స్క్వాడ్లు, నాలుగు సిట్టింగ్ స్క్వాడ్ బృం దాలను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియ ట్ అధికారి గోవిందర్‌రామ్, అధికారులు పాల్గొన్నారు.

విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని ప్రచా రం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం చేతివృత్తుల వారందరికీ తెలియజేయాలన్నారు. పీఎం విశ్వకర్మ పథకానికి 18 రకాల చేతి వృత్తుల వారు అర్హులను తెలిపారు. కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ)లో ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు పుస్తకం, ఆధార్ లింక్‌డ్ మొబై ల్ నంబరుతో వివరాలు నమోదు చేసుకోవాలని వివరించారు. పథకానికి ఎంపికైన వారికి ప్రోత్సాహకం టూల్ కిట్ కింద రూ.15వేలు, పీఎం విశ్వకర్మ డిజిటల్ గుర్తింపు కార్డు, ధృవీకరణ పత్రం, శిక్షణాకాలంలో రోజుకు రూ.500 స్టైఫండ్, మార్కెటింగ్, బ్యాంకు నుంచి మిదటి విడతగా రూ.లక్ష వరకు రుణం తీసుకుని 18నెలల్లో 5శాతం వడ్డీతో చెల్లించాల్సి ఉం టుందని పేర్కొన్నారు. ప్రత్యేక అధికారులు, గ్రామ కార్యదర్శులు ఈ పథకంపై విస్తృత ప్రచారం కల్పిం చి అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం ప్రశాంత్, ఆయా సంక్షేమ శాఖల అధికారులు, కార్మిక శాఖ, డీపీవో, డీఆర్డీవో తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

దళితబంధు అందించండి సారూ

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 12: దళిత బంధు అందించి న్యాయం చేయాలని అందోల్ నియోజకవర్గంలోని వివిధ మండలాల లబ్ధిదారులు కోరారు. సోమవారం కలెక్టరేట్ ఏవో పరమేశ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితబంధు పథకాన్ని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. తొలివిడత దళితబంధు గ్రౌండింగ్ పూర్తి అయిన తర్వాత రెండో విడతలో తాము ఎంపికయ్యామన్నారు. అధికారులను లబ్ధిదారుల ఇండ్లకు వచ్చి విచారణ పూర్తి చేశారని గుర్తు చేశారు. ఎన్నికల కోడ్ రావడంతో దళితబంధు అందలేదని, వెంటనే అందించి న్యాయం చేయాలన్నారు.

ఎయిడ్స్ భూతాన్ని తరిమేద్దాం

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 12: సమాజం నుంచి ఎయిడ్స్ భూతాన్ని తరిమేద్దామని తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డేనియల్ పేర్కొన్నారు. నెహ్రూ యువకేంద్రం, తారా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల సహకారంతో సోమవారం కళాశాలలో ఎయిడ్స్ వ్యాధి నివారణ మార్గాలు-ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం జిల్లాస్థాయిలో ఎయిడ్స్‌పై చిత్రలేఖనం, క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ప్రథమ బహుమతులు అందజేశారు.

ఎంపీ ఆర్థికసాయం

జహీరాబాద్, ఫిబ్రవరి 12: సంత్ సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ రూ.లక్ష విరాళం ఇచ్చారని బీఆర్ఎస్ నాయకుడు, టెలికం బోర్డు సభ్యుడు శంకర్‌నాయక్ పవార్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో బంజారా నాయకులతో కలసి సేవాలాల్ జయంతి వేడుకలకు హాజరుకావాలని ఎంపీని ఆహ్వానించారు. కార్యక్రమంలో ప్రేంసింగ్, శ్రీనివాస్‌నాయక్ పవార్, సంజీవ్‌కుమార్ పవార్, విజయ్‌రాథోడ్, హేర్ రాథోడ్, వాసునాయక్, భీంరావు, నరేశ్ ఉన్నారు.

పాఠశాలలో సైన్స్‌ఫెయిర్

బొల్లారం, ఫిబ్రవరి 12: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని వశిష్ఠ పాఠశాలలో సోమవారం సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ జడ్పీటీసీ కోలన్ బాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రయోగాలను వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మేధోసంపత్తి అభినందనీయమన్నారు. అనంతరం నాయకులను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధం

హత్నూర, ఫిబ్రవరి 12: గ్యాస్ సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధమైన ఘటన హత్నూర మండలం మాధురు గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తలారి సునీత ఇంట్లో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి ఇంటికి నిప్పంటుకోవడంతో మంటలు పెద్దఎత్తున చెలరేగాయి. దీంతో స్థానికులు మంటలార్పడానికి ప్రయత్నించగా అప్పటికే ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇంట్లోని వంట సామగ్రి, వస్తువులు పూర్తిగా కాలిపోయాయని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

అథ్లెటిక్స్ మీట్‌కు ఆదర్శ విద్యార్థులు

బొల్లారం, ఫిబ్రవరి 12: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఇంటర్ డిస్ట్రిక్ట్ నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ, పీడీ శశిరేఖ తెలిపారు. ఈనెల 16 నుంచి 18వరకు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగే క్రీడల్లో అక్షిత్, అక్షయ, సంధ్య, వైష్ణవి పాల్గొంటారని పేర్కొన్నారు. 2023 డిసెంబర్ 18న రాష్ట్రస్థాయి పోటీల్లో నలుగురు విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులు గుజరాత్‌కు వెళ్తున్నట్లు ప్రిన్సిపాల్, పీడీ తెలిపారు.

ఇసుక ఫిల్టర్లపై దాడులు

సంగారెడ్డి అర్బన్ ఫిబ్రవరి 12: మండలంలోని ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో అక్రమ ఇసుక ఫిల్టర్లపై రెవెన్యూ, పోలీసులు అధికారులు దాడులు నిర్వహించారు. అక్రమంగా ఇసుక ఫిల్టర్లు నిర్వహిస్తూ, లారీల్లో తరలిస్తున్నారన్న సమాచారంతో తహసీల్దార్ పర్వీన్ షేక్, రూరల్ ఎస్సై దాడులు చేశారు. 9లారీలు, 3జేసీబీలు, 3ప్రొక్లెయిన్ల ను సీజ్ చేసి, ఇసుకను స్వాధీనం చేసుకున్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వరంగ సంస్థ)
సంగారెడ్డి మెయిన్ బ్రాంచ్

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

దిగువ రుణగ్రహీతలు మరియు హామీదారుల నుండి సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు బకాయి రూ. 41,20,256.17 (నలభై ఒక్క లక్షల ఇరవై వేల రెండు వందల యాభై ఆరు రూపాయల పదిహేడు పైసలు మాత్రమే -28.05.2023 వరకు విధించబడిన వడ్డీ) + వడ్డీ + ఇతర చార్జీలను రాబట్టుకొనుటకు సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టబడిన/చార్జ్ చేయబడిన, రీజినల్ ఆఫీస్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారిచే లాంఛనప్రాయ స్వాధీనం చే